సాక్షి తిరుపతి

శనివారం : 27 : జూలై : 2024



సమాజహిత సారథులు

సమాజ హిత సారథులు మహిళలని, సమాజంలో వారి పాత్ర ఎంతో కీలకమని పలువురు వక్తలు కొనియాడారు. - 8లో



పెరటికోళ్ల ఫామ్ దగ్ధం

పెరటికోళ్ల ఫామ్ దగ్ధమైంది. రూ.15 లక్షల మేర నష్టం వాటిల్లినట్టు బాధితుడు వాపోయాడు. - 8లో



తగ్గని సోదర ప్రేమ!

భార్య, బిడ్డలను అతికిరాతకంగా చంపేశాడు. కానీ అన్న తన భార్య, పిల్లలతోనే తమ్ముడికీ దహన సంస్కారాలు నిర్వహించాడు. - 8లో

న్యూస్‌రీల్

నైపుణ్యంతోనే ఉద్యోగం



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా వృత్తి నైపుణ్యాభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైపుణ్యంతోనే ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. ఈ క్రమంలో యువతకు అవసరమైన నైపుణ్యాన్ని కల్పించడానికి శిక్షణ ఇవ్వాల్సి ఉందని సూచించారు. ఉద్యోగాలు పొందడానికి వీలుగా ఉండే కోర్సులు, మార్కెట్‌లో డిమాండ్ ఉండే కోర్సులకు అవసరమైన శిక్షణ ఇవ్వాలని చెప్పారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ కన్వీనర్, డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ రీజనల్ అధికారి శ్యామ్‌మోహన్, జిల్లా అధికారి ఆర్.లోకనాథం, శ్రీపద్మావతి యూనివర్సిటీ, శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ప్రతినిధులు, ఎల్డీఎం విశ్వనాథరెడ్డి, ఏడీ న్యాక్ సతీష్‌చంద్ర, మెప్మా ప్రతినిధి కృష్ణవేణి, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి, గోపీకృష్ణ, ఐటీఐ, పాలిటెక్నిక్ కన్వీనర్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ సంక్షేమశాఖ కార్పొరేషన్ ప్రతినిధులు, ఏపీఎస్‌ఎస్డీసీ, సీడ్ యాప్, ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ



మహిళలకు కోడి పిల్లలను అందజేస్తూ..

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో పశు వైద్య విద్య, సమాచార కేంద్రం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా పెరటి కోళ్ల పెంపకంపై జరిగిన రైతు నైపుణ్యాభివృద్ధి శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా సుమారు 30మంది మహిళలు పాల్గొన్నారు. అనంతరం వీరికి 15 అసీల్ జాతి కోడిపిల్లలను, పెంపకానికి ఉపయోగించే కిట్లను అధికారులు అందజేశారు. వర్సిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ శ్రీలత, హైదరాబాద్ నార్మ్ సంస్థ ప్రధాన శాస్త్రవేత్త ఎం.బాలక్రిష్ణన్, సమన్వయకర్త డాక్టర్ సుజాత, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.


వ్యత్యాసాలు గుర్తించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి తుడా: చంటి బిడ్డల్లో అభివృద్ధి, వ్యత్యాసాలను ఎప్పటికప్పుడు గుర్తించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి తల్లిదండ్రులకు సూచించారు. ఎస్వీ మెడికల్ కళాశాల సహకారంతో రుయా చిన్నపిల్లల విభాగంలో శుక్రవారం యునైటెడ్ నేషనల్ చిల్డ్రన్స్ ఫండ్ సంస్థ ఆధ్వర్యంలో చిన్న పిల్లల్లో మెదడు అభివృద్ధి వ్యత్యాసాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంటి బిడ్డల్లో మెదడు ఎదుగుదలపై కొన్ని ప్రాథమిక నియమాలను గుర్తించాలన్నారు. పిల్లలకు క్రియాత్మక దృష్టి ఉందని నిర్ధారించుకోవాలని, స్పర్శ, శ్రవణం తదితర సామర్థ్యాల్లో వ్యత్యాసాలు తెలుసుకోవాలన్నారు. ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, యూనిసెఫ్ దక్షిణాది రాష్ట్రాల ఇన్చార్జ్ డాక్టర్ శ్రీధర్, రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ ప్రశాంత్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, ఇండియా మోడ్యల్ థియేటర్ డాక్టర్ శశికళ, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్, డాక్టర్ సంతోష్ డాక్టర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ టీబీసీ వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 61,699 మంది స్వామివారిని దర్శించుకోగా 25,082 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.55 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 16 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

చేతులెత్తి మొక్కుతాం.. చదువుకోనివ్వండి!



'సీఎం సారూ.. చేతులెత్తి మొక్కుతున్నాం. మమ్మల్ని కరుణించండి. మేం సంచార జీవులం. మా పెద్దోళ్లు రెక్కల కష్టం చేస్తేగానీ మా నాలుగు వేళ్లు నోట్లోకి వెళ్లవు. ఇప్పుడిప్పుడే నివాసాలేర్పర్చుకుని స్థిరపడుతున్నాం. అలాంటి మాపైనే కొందరు కక్షగట్టారు. రాజకీయ వేధింపులతో ఊరు నుంచి వెళ్లగొట్టారు. చదువుకు దగ్గరవుతున్న తరుణంలో మమ్మల్ని అర్ధంతరంగా దూరం చేశారు. మాకు ఇంత అన్యాయం జరిగినా మా వెంట నిలిచే నీడలేదు. మా గోడు వినిపించే గొంతుక లేదు. మా మొర మీరైనా ఆలకించండి. మాకు రక్షణ కల్పించి.. మా కుటుంబాలను ఊరుకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టండి. మళ్లీ మేము చదువుకునేలా కరుణ చూపండి! అంటూ పలువురు పిల్లలు చేతులు జోడించి అర్థిస్తున్నారు. చదువుకునే వయసులో వేధింపులొద్దని ప్రాధేయపడుతున్నారు.



- చిగురుటాకుల్లా షికారీలు!
- వైఎస్సార్‌సీపీకి ఓటేశారన్న అక్కసుతో కక్ష
- ఊరు నుంచి తరిమేసిన టీడీపీ నాయకులు
- ఒడిశా రాష్ట్రంలో బిక్కుబిక్కుమంటున్న 30 కుటుంబాలు
- ఆగిన 20 మంది విద్యార్థుల చదువులు
- శ్రీకాళహస్తి మండలం, ఎంపేడు ఈశ్వరయ్య కాలనీలో ఘటన
- మూగబోయిన మానవ, ప్రజాసంఘాలు
- బాబు పాలనలో బక్క జీవులపై ఆటవిక పెత్తనం

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం, ఎంపేడు గ్రామ పంచాయతీలోని ఈశ్వరయ్య కాలనీలో దాదాపు 70 కుటుంబాలు షికారీలు ఉన్నారు. వారంతా సంచార జీవులు. కాలానుగుణంగా ప్రభుత్వాలు ప్రోత్సహించడంతో ఇప్పుడిప్పుడే స్థిర నివాసాలు ఏర్పరుచుకుంటున్నారు. అయితే గత పాలనలో తమకు అనేక సంక్షేమ పథకాలు అందడమే కాకుండా తమలో ఒకర్ని గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీనికి అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అండగా నిలిచారు. ఈ నేపథ్యంలో గత సార్వత్రిక ఎన్నికల్లో వారంతా వైఎస్సార్ సీపీకి వెన్నుదన్నుగా నిలిచారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి శ్రేణులు చిగురుటాకులపై కక్షగట్టారు. వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారన్న అక్కసుతో ఈశ్వరయ్య కాలనీలోని గ్రామ సర్పంచ్‌తో సహా 30 షికారీ కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేశారు. ఊర్లో ఉంటే చంపేస్తామని హెచ్చరికలు జారీచేశారు. దీంతో వారంతా తట్టాబుట్టా చేతబట్టుకుని జూన్ 7వ తేదీన ఊరు వదిలి వెళ్లిపోయారు. ఒడిశా రాష్ట్రానికి వెళ్లి అక్కడే తలదాచుకుంటున్నారు.

ఆగిన పిల్లల చదువులు

ఈ 30 కుటుంబాలలో సుమారు 20 మంది చదువుకుంటున్న పిల్లలున్నారు. అర్ధంతరంగా వెళ్లిపోవడంతో పిల్లల చదువులు ఆగిపోయాయి. వీరిలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న బీ.భవానీ, 2వ తరగతి విద్యార్థి బీ.నవదీప్, 9వ తరగతి చదువుతున్న ఎం.అభిరామ్, ఎం.పార్థసారథి, 6వ తరగతి విద్యార్థులు బీ.హరీష్, ఎం.సింధు, ఆర్.అశ్విని, 3వ తరగతి విద్యార్థి బీ.హర్షింక్, ఇంటర్మీడియెట్ చదువుతున్న ఎం.తేజ, 4వ తరగతి విద్యార్థి ఆదర్శ, వినయ్, అరవింద్ తదితరులు తల్లిదండ్రులతో పాటు ఒడిశా రాష్ట్రంలో కాలం నెట్టుకొస్తున్నారు.

వినిపించని ప్రజాసంఘాల గొంతుక

గిరిజన తెగకు చెందిన షికారీలపై కక్షగట్టి ఇంత ఘోరంగా రాష్ట్రం విడిచి వెళ్లగొట్టినా.. వారిలో చదువుకునే పిల్లలు.. గ్రామ ప్రథమ పౌరురాలు సర్పంచ్ సుమతి ఉన్నా... కనీసం ప్రజాసంఘాలేవీ అటువైపు కన్నెత్తి చూడలేదు. కనీసం అది అన్యాయమని ఏ ఒక్కరూ నోరు మెదపకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. గిరిజన సంఘాల జాడ కూడా కానరాలేదు. టీడీపీ నాయకుల దుశ్చర్యల మూలాన వీరి జీవనాన్ని మళ్లీ సంచార(దేశదిమ్మర్లు) విధానానికి ఉసిగొల్పేలా ఉన్నాయి.

ఇన్‌స్పైర్‌కు దరఖాస్తుల ఆహ్వానం



ఇన్‌స్పైర్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రయోగాత్మక సైన్స్ నమూనాలకు ప్రతి ఏటా అందించే ఇన్‌స్పైర్ అవార్డుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు. తిరుపతి సమీపంలోని కరకంబాడి జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం ఇన్‌స్పైర్ అవార్డుకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులను శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా కేంద్ర శాస్త్ర, సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఇన్‌స్పైర్‌లో పాల్గొనేందుకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి దరఖాస్తులను సెప్టెంబర్ 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవార్డుకు 6 నుంచి పదో తరగతి విద్యార్థులు అర్హులని, ఒక్కో ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు, ఉన్నత పాఠశాల నుంచి ఐదు నమూనాలకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ ఆఫీసర్ భానుప్రసాద్‌ను 94405 11983 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య, సీఎంఓ సురేష్, ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులకు..

తిరుపతి సిటీ : ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ బీటెక్ సీఎస్ఈ సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఎం.భూపతినాయుడు తెలిపారు. ఏపీ ఈఏపీసెట్-2024లో ర్యాంక్ సాధించిన అభ్యర్థులు వర్సిటీలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో ఈనెల 27 నుంచి వచ్చేనెల 2వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

జనతా క్యాంటీన్లు మెరుగుపడాలి

- ఆగస్టు 5 వరకు గడువు
- ప్రతి హోటల్‌లో ధరల పట్టిక తప్పనిసరి

తిరుమల: తిరుమలకు వచ్చే భక్తులకు సరసమైన ధరలకు పరిశుభ్రమైన, రుచికరమైన ఆహారాన్ని అందించడమే టీటీడీ లక్ష్యమని ఈఓ జె.శ్యామలరావు చెప్పారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఫుడ్ సేఫ్టీ విభాగం వారు అన్నప్రసాదం సిబ్బందికి, పెద్ద, జనతా క్యాంటీన్ల నిర్వాహకులకు త్వరలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతి హోటల్‌లో ధరల పట్టికను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, ప్రమాణాలను మెరుగు పరుచుకునేందుకు ఆగస్టు 5వ తేదీ వరకు సమయం ఇస్తున్నట్లు ఆయన తెలియజేశారు. తిరుమల గోకులం విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో శుక్రవారం టీటీడీ ఈఓ, ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారులతో తిరుమలలోని పెద్ద, జనతా క్యాంటీన్లపై సమావేశం నిర్వహించారు.



మాట్లాడుతున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

పవర్ పాయింట్ ప్రజెంటేషన్..

ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ డిపార్టుమెంట్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు, ఫుడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌పై సవివరమైన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను అందించారు. తినుబండారాల తయారీదారులు అనుసరించాల్సిన పరిశుభ్రత, పారిశుద్ధ్య పద్ధతుల గురించి తెలిపారు. ఆహార భద్రత చట్టాలు, చట్టాల్లో ఉల్లంఘన శిక్షల గురించి తెలియజేశారు. సమావేశంలో జేఈఓ వీరబ్రహ్మం, డిప్యూటీ ఈఓలు ఆశాజ్యోతి, విజయలక్ష్మి, ఇన్‌చార్జ్ ఆరోగ్యశాఖ అధికారి సునీల్ కుమార్, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి జీఎల్ఏ శాస్త్రి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, ఫుడ్ సేఫ్టీ అధికారి జగదీష్, ఫుడ్ సేఫ్టీ డిపార్టుమెంట్, ప్రతినిధులు, ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ గిరిధర్ రెడ్డి, తిరుమలలోని పెద్ద, జనతా క్యాంటీన్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎడ్ల బండ్లకు నో ఫ్రీ

- ఇసుక తరలిస్తే జరిమానా తప్పదు
- రెండు పాయింట్లలో మాత్రమే ఇసుక
- మరో రెండు పాయింట్లలో నో స్టాక్

తిరుపతి అర్బన్: ఎడ్ల బండ్లకు ఇసుక ఉచితం లేదని.. ఒక వేళ నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తే జరిమానా తప్పదని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లో ఆయన ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి ఇసుక జిల్లా కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక పంపిణీ పారదర్శకంగా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎడ్ల బండ్లలో అక్రమంగా ఇసుక తరలిస్తే వారికి జరిమానా వేయాలని ఆదేశించారు. ఇసుక కొనుగోలు చేస్తేనే ఎవరైనా తీసుకుపోవడానికి అనుమతి ఉంటుందని తేల్చిచెప్పారు. జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్లు వెంకటగిరి మండలంలోని మొగళ్లగుంట, సూళ్లూరుపేట మండలంలోని మావిళ్లపాడు, పిచ్చాటూరు మండలంలోని ఏకే బేడు, నాగలాపురం మండలంలోని సుబ్బానాయుడుకండ్రిగ పాయింట్లను ప్రభుత్వం తరుపున గుర్తించినట్టు వెల్లడించారు. ఈ నాలుగు చోట్ల మాత్రమే ఇసుక కొనుగోలుచేసి తీసుకుపోవాలని చెప్పారు. అయితే ప్రస్తుతం పిచ్చాటూరు మండలంలోని ఏకే బేడు, సూళ్లూరుపేట మండలంలోని మావిళ్లపాడు స్టాక్ పాయింట్లతో మాత్రమే ఇసుక నిల్వలు ఉన్నాయని చెప్పారు. మిగిలిన రెండు పాయింట్ల వద్ద ఇసుక లేదని చెప్పారు. కష్టమర్లు ఆ రెండు ప్రాంతాలకు వెళ్లి ఇసుక తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద ఇసుక అక్రమాలపై నిఘా పెంచాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో పెంచల కిషోర్, అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, సెబ్ అదనపు ఎస్పీ రాజేంద్ర, పొల్యూషన్ బోర్డు ఈఈ అశోక్‌కుమార్, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట ఆర్డీఓలు రవిశంకర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, చంద్రముని, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ కుమార్, భూగర్భగనులశాఖ అధికారి ప్రకాష్‌కుమార్, డీపీఓ సుశీలాదేవి పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

'మైకా'ను ముంచిన ఘనులు!

- గనులను మూసేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు
- ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మూతపడ్డ మైకా పరిశ్రమ
- గత 20 రోజులుగా వీధిన పడ్డ 30 వేల మంది కార్మికులు
- ప్రభుత్వానికి రూ.500 కోట్ల పైనే నష్టం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కూటమి సర్కారు దెబ్బకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మైకా పరిశ్రమ కుదేలైంది. ప్రభుత్వానికి ఆదాయం తెచ్చే మైనింగ్ పరిశ్రమ గత 20 రోజులుగా పూర్తిగా నిలిపేయడంతో దానిపైనే ఆధారపడ్డ 30 వేల మంది కార్మికులు వీధినపడ్డారు. ప్రభుత్వానికి సైతం రూ.500 కోట్ల మేర నష్టం వాటిల్లింది.

వెంకటగిరి నియోజకవర్గంలో గతంలో 143 గనులు పనిచేస్తుండేవి. ప్రస్తుతం ఆ సంఖ్య 40కి చేరింది. ఈ ప్రాంతంలో దొరికే మైకా, క్రాస్ సిర ధాతువు, ఫల్స్‌పర్‌కు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో యువపారిశ్రామిక వేత్తలు ఈ పరిశ్రమలోకి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వ ఆదేశాలతో మైకా, క్రాస్ సిర ధాతువు పరిశ్రమలు మూతబడ్డాయి. వెంకటగిరితో పాటు గూడూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో మైకా గనులు విస్తారంగా ఉన్నాయి. ఆ నియోజకవర్గాల్లోని గూడూరు, సైదాపురం, పొదలకూరు మండలాల్లో మైకా, క్వార్ట్జ్ ఫల్స్‌పర్ లాంటి ఖనిజాలు లభ్యమవుతున్నాయి.



మైకా గని లోపల ప్రాంతం

ఈ పరిశ్రమల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మంది కార్మికులకు ఉపాధి లభిస్తోంది. ఈ క్రమంలో ఈ ప్రాంతాన్ని ఆర్థిక జోన్‌గా వ్యవహరించేవారు. మైకా పరిశ్రమపై ఆధారపడి కొన్ని ప్రత్యామ్నాయ పరిశ్రమలనూ ఈ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. ఫల్స్‌ఫర్ ఖనిజం ఇక్కడ లభ్యమవుతుండడంతో సిరామిక్ టైల్స్ ఫ్యాక్టరీలూ ఏర్పాటయ్యాయి. గడిచిన 20 రోజులుగా గనులను మూసివేయడంతో రవాణాతో పాటు మైనింగ్ ఆపరేషన్ పనులు కూడా నిలిచిపోయాయి. దీంతో ఫ్యాక్టరీలకు ముడిసరుకైన ఫల్స్‌ఫర్ ఖనిజం రవాణా కావడం లేదు.



గిరాకీ ఉన్న మైకా క్వార్ట్జ్ ఖనిజం ఇదే

కూలీల బతుకుల్లో అలజడి

ఒక్క సైదాపురం మండలంలోనే సుమారు 25 వేల మంది కార్మికులు మైకా పరిశ్రమలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ లభించే ఖనిజాన్ని దేశవిదేశాలకు నిత్యం తరలించేవారు. ఇప్పుడు ఆ గనులన్నీ మూతపడడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. వాహన యాజమానులతో పాటు.. లోడింగ్ చేసే కూలీలకు కూడా ఉపాధి కరువైంది. వారంతా వలసపోయే పరిస్థితి నెలకొంది. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్వహించే మైనింగ్ ఆపరేషన్ పూర్తిగా నిలిచిపోవడంతో ఏం చేయాలో పాలుపోక యజమానులు సతమతమవుతున్నారు. అన్ని అనుమతులున్న గనుల యాజమానులు కూడా తామేం చేశామంటూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. నిత్యం గనిలో పనులు చేసుకుని ఆనందంగా జీవనం సాగించే కుటుంబాల్లో కూడా అలజడి మొదలైంది. పనులేక వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైకా పరిశ్రమలు నిలిపివేయడంతో ప్రభుత్వానికి రూ.500 కోట్ల మేర నష్టంతో పాటు రావాల్సిన రాయల్టీలకూ నష్టం వాటిల్లింది. ప్రధానంగా క్రయవిక్రయాల కారణంగా వ్యాపారులు చెల్లించే జీఎస్టీకీ భారీగా కోత పడింది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి మైకా పరిశ్రమపై కక్ష వీడి.. 30 వేల మంది కార్మికులకు ఉపాధి కల్పించాలని వారు కోరుతున్నారు.



ఆందోళన చెందుతున్న మహిళా కార్మికులు

మధ్యవర్తిత్వంపై ముగిసిన శిక్షణ

తిరుపతి లీగల్: రాష్ట్ర న్యాయసేవ సంస్థ ఆధ్వర్యంలో రాయలసీమ జిల్లాల్లోని 30 మంది న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై నాలుగు రోజులుగా ఇచ్చిన శిక్షణ శుక్రవారంతో ముగిసింది. శిక్షణ ముగింపు కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్జి ఈ.భీమారావు హాజరయ్యారు. రాయలసీమ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కోర్టుల్లో న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై రిటైర్డ్ జడ్జి సీనియర్ ట్రైనర్ హరీష్ దుడాని మరో సీనియర్ ట్రైనర్ సామాజిక కార్యకర్త నీ నా కరే అవగాహన కల్పిస్తూ ఈనెల 22వ తేదీ నుంచి శుక్రవారం వరకు శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జడ్జి భీమారావు వారి సేవలను కొనియాడుతూ ప్రసంగించారు. ఇద్దరు సీనియర్ ట్రైనర్లను జిల్లా జడ్జి భీమారావు, తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి ఎం.గురునాథ్ సన్మానించారు. ఈ శిక్షణ తరగతులలో తిరుపతి అదనపు సీనియర్ సివిల్‌జడ్జి సునీత రాణి, రెండవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు, ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు.



రిటైర్డ్ జడ్జి, సీనియర్ ట్రైనర్ హరీష్ దుడాని సన్మానిస్తున్న జిల్లా జడ్జి భీమారావు, న్యాయమూర్తులు

రెవెన్యూలో ఏసీబీ గుబులు

పెళ్లకూరు: అవినీతి, అక్రమాలపై ఏసీబీ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచినట్లు సమాచారం అందడంతో స్థానిక రెవెన్యూ అధికారులు వణికిపోతున్నారు. గత నాలుగు రోజులుగా రెవెన్యూ ఉన్నతాధికారులు కొందరు సెలవుపై ఇంటికే పరిమితం కాగా, మరికొందరు పనుల్లేకపోయినా సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయానికి వెళ్తున్నట్టు కొందరు అధికారులు చెవులు కొరుక్కుంటున్నారు. మండలంలోని ఓ సామాన్య రైతుకు చెందిన భూమిని మరొకరి పేరుతో వన్‌బీ, అడంగళ్ మార్చేసినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి మండల స్థాయి రెవెన్యూ అధికారి భారీ స్థాయిలో ముడుపులు తీసుకున్నట్టు సమాచారం. దాంతో బాధిత రైతు ఏసీబీని ఆశ్రయించడంతో గత కొన్ని రోజులుగా వారు పెళ్లకూరు రెవెన్యూపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ క్రమంలో కొందరు అధికారులు వణికిపోతున్నారు.



పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయం



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.70,310
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.6,348
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.83,800
రిటైల్ వెండి గ్రాము రూ.85.80

క్లుప్తంగా

ఉపాధి నిధుల దుర్వినియోగంపై ఆగ్రహం

భాకరాపేట: ఎర్రావారిపాళెం మండలంలో ఉపాధి నిధుల దుర్వినియోగంపై తిరుపతి డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ సభకు ఆయన హాజరయ్యారు. సభలో పంచాయతీల వారీగా చేపట్టిన తనిఖీల్లో వెల్లడైన అవినీతి, అక్రమాలను సభ్యులు చదివి వినిపించారు. అక్రమాలపై పీడీ శ్రీనివాస్‌ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 11 పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే కార్యాలయ సిబ్బంది, ఏపీఓ పైనా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి పథకం ద్వారా పండ్ల తోటల పెంపకంలో మండలానికి మంచి పేరు ఉందని, అలాంటి పేరును దుర్వినియోగం చేయడం మంచిది కాదని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీఓ మధుసూదనరావు, సర్పంచ్‌లు, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

టెట్ పరీక్షకు ఉచిత శిక్షణ

తిరుపతి సిటీ : స్థానిక శ్రీదేవి కాంప్లెక్స్‌లోని శ్రీవెంకటేశ్వర అకాడమీలో ముస్లిం మైనారిటీ విద్యార్థులకు ఏపీ టెట్ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ గీతాంజలి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఈ మేరకు అకాడమీలో ఆదివారం ఉదయం 10గంటలకు ఉచిత డెమో ఉంటుందన్నారు. ఆసక్తిగల ముస్లిం విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 8179392526 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ప్రకాశంరోడ్డులోని శ్రీవిద్య అకాడమీలో ముస్లిం అభ్యర్థులకు టెట్ పరీక్షకు సంబంధించి ఉచితంగా శిక్షణ ఇవ్వన్నుట్లు అకాడమీ కో–ఆర్డినేటర్ ఎం.గుణవతి తెలిపారు. ఆసక్తిగలవారు విద్యార్హత, ఆదాయ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో రావాలని కోరారు. వివరాలకు 70131 19918 నంబరులో సంప్రదించాలని సూచించారు.

సమాజహిత సారథులు మహిళలు


మాట్లాడుతున్న ఎస్వీడబ్ల్యూ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి


సినీ రచయిత పల్లేటి లక్ష్మీకులశేఖర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: సమాజ శ్రేయస్సులో మహిళల పాత్ర ఎంతో కీలకమని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. అభినయ ఆర్ట్స్ జాతీయి స్థాయి నాటక, నృత్యోత్సవాల్లో భాగంగా ఏడో రోజు సంప్రదాయబద్ధంగా మహిళా కళా వేదిక కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వెంకటగిరి ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ తులసీ జ్యోతి, నాట్య కళాకారిణి ఎం.భానుజ, సంగీత కళాశాల అధ్యాపకురాలు ఉషారాణి, కామేశ్వరి అతిథులుగా హాజరై ప్రసంగించారు. మానవజీవన విధానంలో ముఖ్య పాత్రపోషించే శక్తి స్వరూపిణిలు మహిళలని తెలిపారు. భారతీయ సంస్కృతిలో ఎందరో మహిళలు సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించారని గుర్తుచేశారు. గత 23 ఏళ్లుగా జాతీయ స్థాయిలో కళలను, కళాకారులనరు ప్రోత్సహిస్తూ కళా సంపదను భావితరాలకు అందిస్తున్న అభినయ ఆర్ట్స్ ప్రతినిధులు అభినందనీయులని కొనియాడారు. అనంతరం ప్రిన్సిపల్ తులసీ జ్యోతికి ఆచార్య దేవోభవ పురస్కారంతో, నాట్య కళాకారిణి ఎం.భానుజను నాట్య కళా రత్న అవార్డుతో ఘనంగా సత్కరించారు.

ఆకట్టుకున్న అభినయ నాటకోత్సవం

అభినయ ఆర్ట్స్ జాతీయ నాటక, నృత్య పోటీలలో భాగంగా ఏడో రోజు కళాకారులు ప్రదర్శించిన పద్య, సాంఘిక నాటికలు, శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కళాబృందాలు శాస్త్రీయ, జానపద నృత్యాలను చక్కటి హావభావాలు, అభినయంతో ప్రదర్శించి సభికులను అలరింపజేశారు. అనంతరం కర్నూలుకు చెందిన టీవీజీ కళాక్షేత్రం వారు ప్రదర్శించిన శ్రీకృష్ణ కమలపాలిక పద్యనాటకం పౌరాణిక విశిష్టతను ఆవిష్కరించింది. తర్వాత కరీంనగర్‌కు చెందిన శ్రీచైతన్య కళాభారతివారు ప్రదర్శించిన చీకటి పువ్వు సాంఘిక నాటిక ప్రజలను చైతన్యం వైపు మేల్కొల్పింది. ఈ సందర్భంగా కళాకారులను అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బీఎస్.రెడ్డి జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు. అలాగే అద్భుత రచనా శైలితో 45 నంది అవార్డులు పొందిన సినీ రచయిత పల్లేటి లక్ష్మీకులశేఖర్‌ను ఘనంగా సత్కరించారు.

4 నుంచి సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర



- తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ


0000

తిరుపతి(అలిపిరి): ఐఆర్‌సీటీసీ భారతీయ రైల్వే అనుబంధ సంస్థ 'భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు –ఎస్‌సీజెడ్ బీజీ27'ని నడుపుతున్నారని.. ఆగస్టు 4 నుంచి 12వ తేదీ వరకు 'సప్త జ్యోతిర్లింగ దివ్యదర్శన్ యాత్ర' ప్రారంభం కానుందని తిరుపతి పరిసర జిల్లా ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ వేణుగోపాల్ సంయుక్తంగా తెలిపారు. అరుణాచలం, కన్యాకుమారి, మధురై, రామేశ్వరం, తంజావూరు, తిరుచ్చి, త్రివేండ్రం వంటి 7 క్షేత్రాలను సందర్శించనున్నట్లు చెప్పారు. ఆగస్టు 4వ తేదీ నుంచి 12వ తేదీ మధ్యాహ్నం వరకు యాత్ర ఉంటుందన్నారు. యాత్ర సమయంలో ఉదయం టీ, టిఫెన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం (వెజిటేరియన్) అందించనున్నట్లు తెలిపారు. సికింద్రబాద్ రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభమై విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు–రేణిగుంట మీదుగా యాత్ర ప్రారంభమవుతుందన్నారు. ప్రతీ భోగీలో రైల్వే తరఫున ఎస్కార్ట్స్, ఆయా క్షేత్రాల్లో భక్తులను దగ్గర ఉండి తీసుకువెళ్లడం, తిరిగి రైలుకు చేర్చడం, సమయానికి ఆహారం, మంచినీరు, టాయ్‌లెట్ల పరిశుభ్రత, రైలులో సీసీ కెమెరాలు, మైక్ ఏర్పాటు, లగేజీ భద్రత, ప్రయాణ బీమా ఉంటుంది.

రిజర్వేషన్ ఇలా..

స్లీపర్ క్లాస్ రూ.14,250, 3ఏసీ రూ.21,900, 2ఏసీ రూ.28,450 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎల్‌టీసీ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చన్నారు. స్లీపర్‌క్లాస్ వారికి రాత్రి బస నాన్ ఏసీ గదులు కేటాయించడంతో పాటు ఒక్కో గదికి నలుగురు ఉండాల్సి ఉంటుందన్నారు. వీరికి రైలు ప్రయాణంలోనూ నాన్ ఏసీ ఉంటుందని తెలిపారు. 3–ఏసీ బుకింగ్ వారికి రాత్రి బస చేయడానికి ఏసీ గదుల సౌకర్యం ఉంటుందని.. బడ్జెట్ హోటల్‌లో నాన్ ఏసీ గదుల సౌకర్యం ఉంటుందని.. రైలు ప్రయాణం సైతం నాన్ ఏసీ ఉంటుందన్నారు. 2–ఏసీ బుకింగ్ చేసుకున్న వారికి గదుల సౌకర్యంతో పాటు పూర్తిగా ఏసీ ప్రయాణం ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు ఐఆర్‌సీటీసీ కార్యాలయం, మూడో అంతస్తు, రైల్వే రిజర్వేషన్ కాంప్లెక్స్‌లో గానీ, పవన్‌కుమార్ 82879 32313, ఏసయ్య 92814 95853 నంబర్లను సంప్రదించాలని కోరారు. అలాగే ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ http://www.-irctct ourism.com సంప్రదించవచ్చని తెలిపారు.

సూర్యప్రభపై ఊరేగిన చెంగల్వరాయ స్వామి


ఊరేగింపుగా బయల్దేరిన చెంగల్వరాయ స్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న చెంగల్వరాయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై స్వామివారు విహరించారు. తొలుత చెంగల్వరాయస్వామికి విశేష పూజలు చేశారు. అనంతరం వల్లీదేవసేన సమేతంగా స్వామి వారిని అలంకార మండపంలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. తదుపరి స్వామి, అమ్మవార్లను ఆలయంలో ఊరేగించి ఏకశాల వద్దకు తీసుకుని వచ్చి హారతులిచ్చారు. తర్వాత ఊరేగించారు. దక్షిణామూర్తి దగ్గర నుంచి ధ్వజస్తంభం వద్దకు చేరుకుని ప్రత్యేక హారతులు సమర్పించి పాతాళ గణపతి వద్దగల శివయ్య గోపురం నుంచి పట్టణంలోకి చేరుకున్నారు. నాలుగు మాడవీధుల్లో స్వామి, అమ్మవారు మంగళ వాయిద్యాల నడుమ ఊరేగారు. రాత్రి భూత వాహనంపై భక్తులను కటాక్షించారు. ఆలయ డిప్యూటీ ఈఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున్ ప్రసాద్, ఏఈఓ లోకేష్‌రెడ్డి, టెంపుల్ సూపరింటెండెంట్ సీఎస్ఓ నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్ పాల్గొన్నారు.


చెంగల్వరాయస్వామికి హారతిలిస్తున్న వేద పండితులు

పోలీసుల కళ్లు గప్పి పరారీ

పలమనేరు: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న సెబ్ స్క్వాడ్ అధికారుల కన్నుగప్పి నిందితుడు పరారైన సంఘటన శుక్రవారం పలమనేరులో వెలుగుచూసింది. చిత్తూరుకు చెందిన సెబ్ స్క్వాడ్ సీఐ మాధవస్వామి ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం ఉదయం గంగవరం మండలంలోని నాలుగురోడ్ల ప్రాంతంలో కర్ణాటకనుంచి బైక్‌పై మద్యం తెస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. అతని నుంచి పది కేసుల మద్యాన్ని, బైక్‌ను స్వాధీనం చేసుకొని నిందితున్ని పలమనేరు సెబ్ అధికారులకు అప్పగించేందుకు వచ్చారు. స్థానిక సెబ్ స్టేషన్ వద్ద నిందితుడు మూత్ర విసర్జన కోసమని చెప్పి అక్కడి నుంచి ఉడాయించాడు. వెంటనే సిబ్బంది చుట్టుపక్కల వెతికినా లాభం లేకుండా పోయింది. దీంతో ఏం చేయాలో అర్థంగాక పట్టుబడిన మద్యాన్ని, బైక్‌ను స్థానిక సెబ్ స్టేషన్ వద్ద పెట్టి నిందితునికోసం గాలిస్తున్నట్లు తెలిసింది. పరారైన వ్యక్తి గతంలోనూ పలు కేసుల్లో నిందితుడైన బైరెడ్డిపల్లి మండలం లక్కనపల్లికి చెందిన నందాగా సెబ్‌అధికారులు తెలిపారు. ఈ విషయమై స్థానిక సెబ్ సీఐ సురేష్‌రెడ్డిని వివరణ కోరగా ఉదయం ఓ వ్యక్తితోపాటు సీజ్‌చేసిన మద్యాన్ని అప్పగించేందకు వస్తున్నామని స్క్వాడ్ అధికారులు చెప్పినమాట నిజమేనన్నారు. అయితే తమకు నిందితుడిని మాత్రం ఇంకా అప్పగించలేదన్నారు. స్క్వాడ్ టీం నిందితునికోసం గాలిస్తున్నట్టు తెలిసిందన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

– ముగ్గురు స్మగ్లర్ల అరెస్ట్


స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

చంద్రగిరి: అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ఎర్రచందనం దుంగలతో పాటు కారు, ముగ్గురు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ అధికారులు అదుపులోకి తీసుకున్న ఘటన శుక్రవారం శ్రీవారిమెట్టు సమీపంలోని అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. టాస్క్‌ఫోర్స్ అధికారుల వివరాల మేరకు... టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జ్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు.. టాస్క్ ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ అధ్వర్యంలో డీఎస్పీ చెంచుబాబు సూచనల మేరకు ఆర్ఐ (ఆపరేషన్) సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన విశ్వనాథ్ బృందం గురువారం శ్రీవారిమెట్టు పార్కింగ్ నుంచి జూపార్కు వైపు కూంబింగ్ చేసుకుంటూ వెళ్లారు. ఈ క్రమంలో అర్ధరాత్రి సమయంలో జూపార్క్ ప్రహరీ గోడ వద్ద కొందరు వ్యక్తులు కారులో ఎర్రచందనం దుంగలు పెడుతుండడాన్ని గమనించారు. అనంతరం టాస్క్ ఫోర్సు సిబ్బందిని చూసి వారు పారిపోయారు. కారులో నాలుగు ఎర్రచందనం దుంగలు గుర్తించారు. వాటితో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. తిరుమల రెండో ఘాట్ రోడ్డు 36వ కల్వర్టు వద్ద అనుమానిత ప్రాంతాలను తనిఖీ చేసుకుని వెళుతుండగా, అక్కడ ముగ్గురు వ్యక్తులు తారసపడ్డారు. వారు జూపార్కు సమీపం నుంచి పారిపోయిన వ్యక్తులుగా గుర్తించారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకుని, సమీపంలో దాచి ఉంచిన మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు తమిళనాడు రాష్ట్రం, తిరువణ్ణామలై జిల్లా, జమునామత్తూరుకు చెందిన గోపి అయ్యాకన్ను (26), శివరాజ్ మాణిక్యం (39), గోవిందరాజ్ (32)గా గుర్తించారు. వీరిని శుక్రవారం ఉదయం తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసుస్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్టు సీఐ సురేష్ కుమార్ తెలిపారు.

శ్రవణానందకరం


సంగీత కచ్చేరీలో సూర్యప్రకాష్ బృందం

తిరుపతి కల్చరల్: శ్రీత్యాగరాజ ట్రస్ట్ భవనంలోని కళావేదికపై శుక్రవారం రాత్రి ప్రముఖ సంగీత విద్వాంసులు ఆర్.సూర్యప్రకాష్ బృందం ఆలపించిన వాగ్గేయకార సంకీర్తనలు శ్రవణానందకరంగా సాగాయి. శ్రీత్యాగరాజ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన ఈ సంగీతోత్సవాల్లో భాగంగా రెండో రోజు రాత్రి ఆర్.సూర్యప్రకాష్ బృందం గాత్ర కచేరి నిర్వహించింది. ఈ సందర్భంగా త్యాగరాజ వారి సంకీర్తలను సుమధురంగా గానం చేసి సభికులను మైమరిపించారు. వీరికి వయోలిన్‌పై ఎంఏ.సుందరేశ్వరన్, మృదంగంపై డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావు, ఘటంపై మడిపాక్కం మురళి చక్కటి సహకారం అందించారు. దీనికి ముందు ఎస్వీ సంగీత కళాశాల విద్యార్థులు ఆలపించిన భక్తి సంకీర్తలను అలరింపజేశాయి. తర్వాత ప్రముఖ సంగీత విద్వాంసుడు షిమోగటా కుమారస్వామి బృందం ప్రదర్శించిన కచేరీ సభికులను ఆకట్టుకుంది. డబుల్ సాక్సోఫోన్‌పై మాస్టర్ ప్రవీణ్‌పండిట్, వయోలిన్‌పై జ్ఞానదేవ్ మృదంగంపై విజయ నటేశన్, తవిల్‌పై సునీల్‌కుమార్ సహకారం అందించారు. అనంతరం కళాకారులను త్యాగరాజ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఉత్సవ కమిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ మోహన్ సుందరం, కార్యదర్శి కంచి రఘురామ్, ప్రతినిధులు భానుమూర్తి, భీమాస్ అశోక్, ప్రభాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తగ్గని సోదరప్రేమ !

- భార్య, బిడ్డలను అతికిరాతకంగా నరికి చంపిన తమ్ముడు
- అయినా సొంతూరుకు తీసుకెళ్లి దహన సంస్కారాలు నిర్వహించిన అన్న


తమ్ముడికి అంతిమ సంస్కారాలు చేస్తున్న దాసు

సైదాపురం: కట్టుకున్న భార్య, కన్నబిడ్డల భౌతికకాయాలతో పాటు వారిని కిరాతకంగా చంపేసిన తమ్ముడి శవాన్ని కూడా సొంతూరికి తీసుకొచ్చాడు. నాలుగు మృతదేహాలకు ఒకే సారి, ఒకేచోట అంత్యక్రియలు నిర్వహించాడు. ఒక్కసారిగా జీవితం శూన్యమైపోయినా కూడా ఆ అన్నలో సొదర ప్రేమ తగ్గలేదు. ఈ విషాద ఘటన సైదాపురం మండలంలోని గంగదేవిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది.

వెంకటగిరి నియోజకవర్గం, సైదాపురం మండలం, గంగదేవిపల్లి గ్రామానికి చెందిన గుడిమెట్ల తిరిపి దాసుకు 15 ఏళ్ల క్రితం సునీతతో వివాహమైంది. వారికి పెద్ద పాప దేవిశ్రీ, చిన్నపాప నీరజ ఉన్నారు. బతుకుదెరువు కోసం దాసు ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ తిరుపతిలోనే నివాసముంటున్నాడు. ఈ క్రమంలో దాసుకు ఇద్దరు తమ్ముళ్లు ఉండగా.. వారిలో మోహన్ చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడు. చివరి తమ్ముడు శ్రీనివాసులు గ్రామంలోనే ఉండేవాడు. శ్రీనివాసులు బాగోగులు కూడా దాసే చూసేవాడు. తమ్ముడు మోహన్‌కు కూడా దాసే వివాహం జరిపించాడు. మోహన్ భార్య అతనితో ఇమడలేక పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మోహన్ సొంత అన్నపై పగ పెంచుకుని వదిన సునీత, ఆమె బిడ్డలను దారుణంగా నరికి చంపేశాడు. ఆపై మోహన్ కూడా ఉరివేసుకుని తనువు చాలించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

తమ్ముడే చంపినా..!

ఒక్కసారిగా జీవితం శూన్యమైపోయినా కూడా అన్న దాసులో సొదర ప్రేమ తగ్గలేదు. తమ్ముడు మోహన్ మృతదేహాన్ని కూడా సొంతూరు గంగదేవిపల్లికి తీసుకెళ్లాడు. అక్కడే శ్మశానవాటికలో ఒకేసారి ఒకేచోట నాలుగు మృతదేహాలకు దాసే దహన సంస్కారాలను నిర్వహించి మానవత్వాన్ని చాటాడు. ఈ ఘటన స్థానికులను కలచివేసింది.

పెరటికోళ్ల ఫామ్ దగ్ధం

- రూ.15 లక్షల వరకు ఆస్తి నష్టం


మంటలార్పుతున్న అగ్నిమాపకశాఖ అధికారులు

నాయుడుపేట టౌన్: పట్టణ పరిధిలోని జువ్వలపాళెం గ్రామం వద్ద పెరటి కోళ్ల పెంపాకానికి నిర్మించిన ఫామ్ శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఈ ఘటనలో సుమారు రూ.15 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన దాసరి చిరంజీవి పెరటి కోళ్లు పెంచుకునేందుకు ఫామ్ నిర్మాణం చేపట్టాడు. కోళ్లకు సంబంధించిన ధాణా, తదితర వస్తువులను సైతం తెచ్చుకుని అందులో నిల్వచేశాడు. ఇక పెరటి కోడి పిల్లలను కొనుగోలు చేయాల్సి ఉంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కోళ్ల ఫామ్ సమీపంలో ఉన్న ముళ్లపొదలకు స్థానికులు కొందరు నిప్పు పెట్టి దగ్ధం చేశారు. ఆ నిప్పు రవ్వలు కోళ్ల ఫామ్‌పై పడడంతో మంటలంటుకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారి శ్యామ్‌బాబు సిబ్బందితో ఘటనా స్థలానికి చెరుకునేలోపే కోళ్లఫామ్ పూర్తిగా కాలిపోయింది. తనపై కక్షగట్టి ఇలా చేశారని బాధితుడు ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు కూడా ఫిర్యాదు చేయనున్నట్టు సమాచారం.

క్యాన్సర్ వైద్యశిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న టాటా ట్రస్ట్ ఆస్పత్రి వైద్యులు

తిరుపతి కల్చరల్ : టాటా ట్రస్ట్ వారి సహకారంతో జీవకోనలోని రాస్ కార్యాలయంలో మహిళలకు శుక్రవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం చేపట్టారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ వెంకయ్యబాబు మాట్లాడుతూ మితాహారంతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. టాటా ట్రస్ట్ సౌజన్యంతో మూడేళ్లుగా క్యాన్సర్ వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ ప్రతినిధి హేమంత్‌కుమార్ మాట్లాడుతూ బరువు తగ్గడం, జ్వరం రావడం, దగ్గు, నిరంతరం తలనొప్పి, మూత్రనాళంలో రక్తం రావడం, నీరసంగా ఉండడం వంటి కారణాలుంటే డాక్టర్‌ను సంప్రదించి మందులు వాడాలని సూచించారు. అనంతరం సుమారు 150 మంది మహిళలకు బీపీ, షుగర్, హెపటైటిస్, నోరు, రొమ్ము, గర్భసంచి సమస్యలకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో రాస్ ప్రతినిధులు నాగేశ్వర్, శ్రీదేవి, వేదాచలం, భ్రమరాంబ, క్లస్టర్ లీడర్లు మునిలక్ష్మి, పార్వతి, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

విజ్ఞానగిరిపై బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లు పరిశీలిస్తున్న డెప్యూటీ ఈఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను శుక్రవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయ డెప్యూటీ ఈఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి పరిశీలించారు. ఇక్కడ బ్రహ్మోత్సవాలు ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. వాటిని పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



తిరుపతి క్రైమ్: తిరుపతి రైల్వే స్టేషన్‌లో కదిలే రైలు నుంచి కింద పడి ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సుమారు 30 సంవత్సరాలు గల ఓ వ్యక్తి ప్లాట్ ఫామ్‌పై కదిలే రైల్లను ఎక్కే క్రమంలో అకస్మాత్తుగా కాలుజారి కిందపడ్డాడు. దీంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడు ఆచూకీ తెలిస్తే 8328029723 నంబరులో సంప్రదించాలని సూచించారు.